నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 24



జీవిత గమనంలోని 'పదనిస'లకు పదునుపెట్టే వ్యాసపారిజాతాలు, కథన కుతూహలానికి పెద్దపీట వేసే కథా'కనకా'ంబరాలు, కథాకథన చమత్కృతికి అద్దం పట్టే నవలా మందారాలు, ఆధ్యాత్మిక రచనా అరవిందాలు వెల్లి విరిసే సాహితీ పందిరి కొంత ఆర్ద్రతతో కూడిన మానసిక విశ్లేషణను ఆవిష్కరించే మధ్యతరగతి జీవన గతులను చిత్రించడంలో చేయి తిరిగిన రచయిత్రి శ్రీమతి వేదుల శకుంతల. నవ్య నీరాజనం కోసం పలకరించిన పుడు, ప్రత్యక్షంగా వివరించిన ఆమె మనసులోని మాటలు మీకోసం...

# కథలు అల్లిచెప్పడం చిన్నప్పటినుంచీ అలవాటు

**- వేదుల శకుంతల**

### తొలి అడుగులు


అమాయకత్వం, ఉత్సాహం ఉరకలేసే రోజులవి, కోనసీమలో నేదునూరు (అద్దరి) నాన్న స్వగ్రామం. తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామం (ఇద్దరి) అమ్మ పుట్టిల్లు. నిజాం ప్రభువు కాలంలో నాన్న ఉద్యోగరీత్యా ఖమ్మంమెట్టు, హన్మకొండ, హైదరాబాద్‌లలో నివాసం. నా చదువు ఖమ్మం ఆంధ్రభాలికా పాఠశాల, వరంగల్ కిషన్‌పురాలోని మిడిల్ స్కూల్లోనూ సాగింది. సరిగ్గా అపుడే రజాకారు మూమెంట్ సమయం. అల్లర్లు, అత్యాచారాలు నానాభీభత్సంగా ఇళ్ళల్లో ఉండడమే కష్టమైన రోజులు. నాన్న నన్ను, తమ్ముడు, అమ్మని మా చిన్న మావయ్య ఇంటికి ద్రాక్షారామం పంపించారు. ఆ సంవత్సరం నా చదువు అటకెక్కింది. అయితే అప్పటికే ప్రథమ పూర్తిచేశాను గనుక హిందీ మాధ్యమ రాసి పాసయ్యాను. చిన్నమామయ్య వాడపల్లి మృత్యుంజయ సోమ యాజి. వేద పండితుడు. వేదం నేర్చుకోడానికి శిష్యులు వస్తుండేవారు. అలా నాకు తెలీకుండానే దైవిక శక్తులు తాకుతూ ఆధ్యాత్మికతకు బీజాలు పడ్డాయని పిస్తుంది. ఆ తర్వాత మళ్ళీ వరంగల్, చదువు, అభ్యుదయం మామూలే. నా పుట్టినరోజు అక్టోబర్ 24, 1939. అమ్మ మాణిక్యాంబ. నాన్న అన్నంగి సూర్య

నారాయణ. ఆడపిల్లల్ని, మగపిల్లల్ని సమానంగా స్వేచ్ఛనిచ్చి పెంచిన సంస్కారం, కుటుంబ వ్యవస్థ పట్ల కలిగించిన గౌరవం నాకు, నా రచనలకి ఆద ర్శప్రాయం. అందుకు నా తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది.

స్నేహితులం కలిసి తిరిగ్గా వున్నప్పుడు కథలు చెప్పుకునేవాళ్లం. వాళ్లు విన్నవి, చదివినవి చెప్పేవారు. నేను ప్రతిసారీ ఓ కొత్త కథ కల్పించి చెప్పే దాన్ని. అలా కథలు చెప్తూ చెప్తూ కలం పట్టాను. పేపర్లో వార్తలు తప్ప కథలు, కాకరకాయలు పట్టించుకోని నాన్నగారు ఓ రోజు దినపత్రిక (పేరు గుర్తులేదు) నా చేతికిచ్చి ''అమ్మాయ్, ఈ కథ చదువు. ఎంత బావుందో'' అన్నారు. రచ యిత పేరు గుర్తులేదు. కథ పేరు 'రాలని బిందువు'. ఆస్పత్రిలో పురుడు పోసు కుని, తన పిల్లాడు మారిపోయాడేమో అన్న అనుమానంతో వాణ్ణి పెద్దకొడు కుతో సమానంగా పెంచదు. కాస్త పెద్దయ్యాక ఓ ఎగ్జిబిషన్‌లో తప్పిపోయి, యాక్సిడెంటల్‌గా చచ్చిపోతాడు. బిడ్డ శవం ఎదురుగా వున్నా ఏడవకుండా వుండిపోయిన భార్యతో ''నీకింకా వాడు నీ కొడుకు కాదేమోనని అనుమానం. అందుకే కన్నీటి బిందువు రాలకుండా కంట్లో నిలిచిపోయింది'' అంటారు. ఇప్పటికీ నా ఎనిమిదో క్లాసులో చదివిన ఆ కథ మనసుకి హత్తుకునే వుంది. ఆక ట్టుకునే కథలు రాయాలన్న ఆకాంక్ష కలిగింది. 'రాష్ట్ర'దాకా హిందీపరీక్షలు పాసవడం వల్ల స్కూలు లైబ్రరీలో హిందీ, తెలుగు పుస్తకాలు చదువుతుండే దాన్ని. శరత్ సాహిత్యం, డిటెక్టివ్ నవలల ప్రభంజనం రోజులవి.

## శ్రీవారి ముచ్చట్లు

హైస్కూల్లో వుండగానే పెళ్ళయింది. హెచ్.ఎస్.సితో చదువు ఆగి అత్తారిం టికి వెళ్లాను. వరంగల్‌లో మావారు వేదుల గోపాలకృష్ణమూర్తిగారికి ఉద్యోగం. సాహిత్యాభిమాని. పత్రికలు, పుస్తకాలు కొని తీసుకొచ్చేవారు.రాయడం వరకే నా పని. వాటిని పోస్ట్ చేసే బాధ్యత ఆయనే తీసుకునేవారు. బాల్యవివాహం నాది. పెళ్లయిన మూడేళ్లు హెచ్.ఎస్.సి దాకా అమ్మదగ్గరే వుండేదాన్ని. ఆవిడ నాచేత నోములు, వ్రతాలు, పేరంటాలు చేయిస్తూనే స్కూలు ప్రోగాముల్లో పాల్గొనమని ప్రోత్సహించేది. మావారు కూడా నా సాహితీ సహవాసాలు, మహిళా కార్యక్రమ



నిర్వహణల్ని కాదనలేదు. మీటింగ్‌లనుండి రాత్రి పొద్దుపోయి వస్తే వీధి చివర నుంచుని వెలుగురేఖలా ఎదురు చూస్తుండేవారు. సంసారం సరదా. నో పోట్లా టలు. అలక నాదే. తనే బతిమాలేవారు. అనురాగ సుధాసారం

ఇక్కడో సంగతి చెప్పాలి. నా కథ 'వరలక్ష్మి'కి ఆంధ్రపత్రిక వీక్లీలో 1968వ సంవత్సరం దీపావళి కథల పోటీల్లో మూడవ బహుమతి వచ్చింది. పారితో షికం 500 రూపాయలు పంపారు. చూసి మావారు నవ్వుతూ 'ఫరవాలేదే' అని కళ్ళెగరేశారు. అపుడాయన నెల జీతం 350 రూపాయలు. నా మొదటి కథ 'అసమర్థుడు' అదే పత్రికలో 1967లో వచ్చింది.

## నచ్చినవి

**కథ** – మునిమాణిక్యం గారి 'కాంతం కథలు'
**సినిమా** – పాతాళ భైరవి
**గాయకుడు** – ఘంటసాల
**గాయని** – సుశీల
**హీరో** – ఎఎన్నార్
**హీరోయిన్** – సావిత్రి
**ప్రదేశం** – ద్రాక్షారామం
**వంటకం** – కలాఖండ్
**నగ** – నెక్లెస్ (సింపుల్)
**చీరలు** – లేతరంగుల వెంకటగిరి, గద్వాల్
**రచయిత** – మొక్కపాటి నరసింహారావు
**ఫ్రెండ్స్** – రాణి సంయుక్త, ప్రఫుల్ల
**వ్యక్తి** – మా పిన్ని కూతురు రామలక్ష్మి, మా పెద్దత్తగారి కొడుకు, మా వారి కజిన్ బ్రదర్ డా. పోరంకి దక్షిణామూర్తి.

## రచనా దృక్పథం

కథలు, నవలలు రాయడం వెనుక ఆశయం, ఆదర్శాలు అంటూ లేవు ప్రత్యే కంగా. అయితే కథలు కల్పనతో అల్లి చెప్పడం చిన్నప్పటి నుంచీ అలవాటు. కనుక నా చుట్టూ సమాజం, వ్యక్తులు, మనస్తత్వాలు, పరిస్థితులు మొదలైనవాటి పట్ల అక్కర వుండేది. 'ఏమిటిలా' అని ఆలోచింపజేసేవి. వాటిని కథగా మలచాలని పించేది. ఎంచుకున్న అంశాన్ని బట్టి కథ, నవల, వ్యాసం అలా ప్రక్రియ మారు తూంటుంది కదా! అందులో భాగమే పోటీలకు పంపడం, మామూలుగా రాయడం మనకు తెలిసిన జీవితంలోంచి కథ రాసిన పుడు ఎంతో సహజంగా వస్తుంది. కృత్రిమత్వం ఏవి ధంగానూ నాకు నచ్చని విషయం. అనుభవంలోంచి వచ్చే వాస్తవికతకి కించిత్ కల్పన వుండాలిగాని, ఆయా కల్పనే అయితే కథ నిలబడదు.


## నాడు నేడు

అల్లిబిల్లి, జాబిల్లి ఊహలు కాకుండా ఎన్నేళ్ళ యినా గుండెపొరల్లో దాక్కునేదే కథ. రాసిన కొద్దీ రచయిత ఎదగాలి. చదివినకొద్దీ పాఠకుని మేధస్సు పెరగాలి. 1964 నుండి నేటివరకు రాస్తూనే వున్నాను. మనసుని కదిలించే అంశం దొరికినపుడు రాయకుండా వుండలేను. రచనా సృజనలో నిర్లిప్త ధోరణి కూడనిది. కథాకథనాలకి ఒక సమగ్రరూపం రూపుదిద్దుకున్నాకే రాస్తాను.

మొదటి కథనుండి ఈనాటివరకు సాహిత్యప రంగా ఎన్నో మార్పులు. కాలానుగుణంగా తీరుతె న్నులు మారినా, సాహిత్యపు విలువలు తొణికిపోకూ డదు. మంచి కథలొస్తున్నాయి. అనూహ్య కథనుండి సాగుతున్నాయి. ఒకప్పటి కథకులు మంచి ఫిజీషియన్లు. ఇప్పటి కథకులు స్పెషలిస్టులు, సమాజాన్నీ క్లోజప్‌లో చూసి కులం, మతం, వాదం, మాండ లికం, సామాజిక రుగ్మతలు... ఇలా స్పెషల్ క్యాటగిరీ కథలు వస్తున్నాయి. ఏ సృజననైనా నిలబెట్టేది దానిలో అంతర్లీనంగా వున్న మానవతావాదమే.

## అభిమానం

వేదుల శకుంతల అనగానే 'ఆర్తి, శారద రాత్రులు, పునాదిరాళ్లు, వెలుగు



జి.వి.సుబ్రహ్మణ్యం చేతులమీదుగా తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం అందుకుంటూ...

వాకిలి, అఫ్ట్రాల్ ఆడది' నవలలు గుర్తొస్తాయి. ఈమధ్య ఒక ఇఎస్ఐ డాక్టర్ రంగనాథ్ ''నేను మీ శారదరాత్రులు నవల ఫ్యాన్‌నండీ. మీ ఫ్యామిలీ ఫ్రెండ్‌గారి ఫోన్లోంచి మాట్లాడుతున్నాను'' అని కాసేపు నా కథల గురించి, నవలల గురించి మాట్లాడారు. సమాజానికి మేలు చేసే రచనలు ఎవరూ మర్చిపోరు. సంతోషం అనిపించింది. దశాబ్దాల కిందటి నవల ఈనాటికీ ఆలోచింపజేస్తోందంటే రచయితకి అంతకంటే కావాల్సిందేముంటుంది!

**ఆత్మబంధువులు**

నాకు ఇద్దరు అమ్మాయిలు. ఒక అబ్బాయి. అందరూ సుఖంగా స్థిరపడ్డారు. మా అబ్బాయి కాళిదాసు ఎంతో సహనంతో, ప్రేమాభిమానాలతో నాకిచ్చే గౌరవం నాకెంతో తృప్తినిస్తుంది. నా కోడలు మాధురి, మనవరాలు చి. కావ్య పట్ల చూపే అనురాగం, నా రచనలపై చూపే మక్కువ మరిన్ని రచనలు చేయాలనిపించే స్ఫూర్తినిస్తాయి. ఈ మధ్య చాలా అనారోగ్యం చేసింది నాకు. బంధువులు, మిత్రులు చూపిన అభిమానమే ప్రాణవాయువై మళ్ళీ నవల, కథలు రాసేలా చేసింది.

**తరంతరం, నిరంతరం**

కథలు రాసి పత్రికలకి పంపమన్న నా చిన్ననాటి స్నేహితురాలు అహల్య, బాల్య స్నేహితురాలు వరలక్ష్మి, హైస్కూలు నుండి ఇప్పటిదాకా స్నేహహస్తం వదలని రాణి (కలెక్టర్) గాయని ప్రఫుల్లకి నేను ఎప్పటికీ ఆపకుండా రాయడం ఇష్టం

సనాతన కుటుంబంలో పుట్టి అభ్యుదయ భావాలతో రచనలు చేయగలుగుతున్నానంటే అందుకు నేను చదివిన ప్రముఖుల రచనలు, అమ్మ, నా భర్త, నాన్నల ప్రోత్సాహం, ఇచ్చిన స్వేచ్ఛాస్వాతంత్రాలు, గౌరవం కారణాలు.

రచయితకి ఆత్మవిమర్శ వుండాలి. చట్రాలు బిగించుకోకుండా స్వేచ్ఛగా రాయాలి. వ్యవస్థ తీరుతెన్నుల బట్టే కథావస్తువులుంటాయి. ఒక్కో రైటర్‌దీ ఒక్కో శైలి. తప్పుదు. అయితే కథాశిల్పం గురించి కూడా కాస్త శ్రద్ధ పెడితే బావుండనిపిస్తుంది.

**నచ్చిన ఫిలాసఫీ**

నచ్చనవి, భరించాలేగాని బాధపడకూడదు. 'కలిమిలేములు, కష్టసుఖాలు కావడిలో కుండలని భయమేలోయ్? కావడి కొయ్యేనోయ్, కుండలు మన్నేనోయ్.' కి మించిన తాత్వికత ఏముంది!! మావారు హఠాత్తుగా పోయినపుడు ఓ విధమైన విరక్తి, నిర్వేదం. చాలాకాలం డిప్రెషన్లో వున్నాను. అంతరాంతరాల్లోని భక్తి, జ్ఞాన, యోగ, ధ్యానాలే నన్ను మామూలు మనిషిని చేసి, రచనాశక్తినిచ్చాయి.

వందేళ్ళ తెలుగుకథ అన్ని విధాలా అనేక మార్పులు చెంది ఇవాళ ఒక కొత్తదనాన్ని సంతరించుకుంది. భావవ్యక్తీకరణలో 'పదును' పెరిగింది.

**-కె.బి.లక్ష్మి**

## విశ్వనాథ విసుర్లు



ఆంగ్లోపన్యాసులైన జొన్నలగడ్డ సత్యనారాయణ గారూ, ఆంధ్రోపన్యాసకులైన కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఇద్దరూ మంచి మిత్రులు. పరస్పరం గౌరవం వున్నవారు. ఓ రోజు జొన్నలగడ్డ వారు మాటల సందర్భంలో ''మీరు తెలుగేం నేర్చుకుంటున్నారురా-సమ్ రాట్! అవునా?'' అన్నారు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారిని మనస్సులో పెట్టుకుని- ఆ మాట ఏ విద్యార్థో విశ్వనాథ చెవిలో ఊదాడు. ఆ తరువాత క్లాసుకి ఆయన వచ్చి,

''శ్రీనాథుడు ఏమన్నాడంటే, 'జొన్నకలి-
జొన్న అంబలి-జొన్నన్నము-జొన్న పిసరు-
జొన్నలె తప్పన్ సన్నన్నము సున్నసుమీ...''

అంటూ రాగయుక్తంగా పాడి జొన్నలగడ్డ వారిని స్ఫురింపజేసి క్లాసంతా నవ్వులతో ముంచెత్తారు.

## మందా? సంగీతం విందా?



కథా చక్రవర్తులుగా పేరు గాంచిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. కావ్యాలు చదివారు. కవిత్వాలు వ్రాశారు. కథలతో బాటు నవలలూ, నాటకాలూ కూడా రచించారు. సంగీతంలో కృషి చేసి ఫిడేలు వాయించేవారు. కాస్తో కూస్తో ఆయుర్వేద వైద్యంలో కూడా ప్రవేశం సంపాదించారు.

కళాభివృద్ధినీ పరిషత్తు ద్వారా తన రచనల్ని తానే ప్రచురించుకుంటూ, సుబ్రహ్మణ్య శాస్త్రిగారు రాజమండ్రి ఇన్నీసు పేటలో కొన్నాళ్ళు ఆయుర్వేదం మందుల షాపు కూడా నడిపారు. ఆయన మందుల షాపులో మందుల హడావిడి కంటే, అక్కడికి వచ్చి చేరే కళాకోవిదుల కారణంగా, సంగీత, సాహిత్య గోష్ఠుల సందడీ, తత్సంబంధమైన చర్చల హడావిడి ఎక్కువగా ఉండేది.

ఒక రోజున ప్రసిద్ధ భావ కవి శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు వచ్చి మందుల కొట్లో కూర్చుని, ''అయ్యా! ఆనందభైరవి అందుకోండి'' అన్నారు. వెంటనే శ్రీపాద వారు ఫిడేలు తీసి ఆనంద భైరవి రాగాలాపన ప్రారంభించబోయారు. వెంటనే వేదుల వారు పకపక నవ్వి ''అయ్యా-నాకిప్పుడు కావలసింది సంగీతం కాదు-మందు'' అన్నారు. శ్రీపాద వారు కూడా నవ్వుకొని ఫిడేలు పక్కన పెట్టి ఆనందభైరవి మందు సీసా అందుకుంటూ ''ఇందుకే అన్నారు సంగీతము చేత బేర సారములడిగెన్ అని'' అన్నారు మందు అందిస్తూ. సవ్యసాచిలా-అటు ఆరోగ్యాన్నీ, ఇటు ఆహ్లాదాన్నీ అందించగల సమర్థులైన శ్రీపాద-

## అర్థవంతమైన అచ్చుతప్పు




ఓ మారు, మధునాపంతుల వారికి, ఆయన 'ఆంధ్ర పురాణం' కారణంగా కోలంకలో భారీ ఎత్తున సన్మానం జరిగింది. ఆ సభకి భమిడిపాటి వారు హాజరు కావలసిందే-కాని ఆయన షష్ఠిపూర్తి ఉత్సవం దగ్గర్లో ఉండడం వల్ల ఆయన రారు అని ముందే రూఢి అయిపోయింది. జమ్ములమడక, వేదుల వంటి హేమాహేమీల ఉపన్యాసాలు అయిపోయాయి. సభకు అధ్యక్షత వహించిన శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు గారు తమ మలి పలుకుల్లో 'భమిడిపాటి వారు కూడా వస్తే బాగుండి ఉండేది' అన్నారు. సభ్యుల వెనకాల జనం మధ్య నుంచున్న భమిడిపాటి వారు ''నేను వచ్చాను'' అన్నారు. సభ సంభ్రమాశ్చర్యాలతో నిండిపోయింది. వేదిక మీదకి రమ్మని ఏదైనా మాట్లాడమనీ అంతా వత్తిడి చేశారు. బెట్టుగా వేదికి మీదికి వచ్చి సీరియస్‌గా ముఖం పెట్టి ''అందరూ అద్భుతంగా మాట్లాడారు అయితే, ఆహ్వాన పత్రంలో అచ్చు తప్పు పడింది. అంతా దిద్దుకోండి. ఆయన ఇంటి పేరు 'మధునాపంతు' కాదు, మధు నా వంతు, ఇదీ విషయం-శలవు'' అని కూర్చున్నారు. సభాప్రాంగణం చప్పట్లతో మారుమోగిపోయింది.

**నాకు నచ్చిన నా కథ**

# నూటికో తల్లి

- వేదుల శకుంతల

మధ్యాహ్నం ఎండ మహాజోరుగా ఉంది. కిటికీ కర్టెన్ కొద్దిగా జరిపి చూస్తున్నాను. పాల వ్యాన్ పెద్దహారన్‌తో పోతోంది. స్కూల్ బస్సు ఆగింది. బుడతకీచుల్లా ఇద్దరు పిల్లలు దింపబడ్డారు బస్సులో నుంచి. వాళ్ళ భుజాలకి పుస్తకాల సంచులు వాటర్ బ్యాగులు, నెత్తిన తెల్ల టోపీలు, కాళ్ళకి మేజోళ్ళతో బిగించిన బూట్లు, వాటిమీద దుమ్ము. బస్సులో నుంచి దింపబడ్డ ఆ పసివాళ్ళు వేళ్ళాడిపోతూ ఉన్నారు. వాళ్ళకోసం రోడ్డు ప్రక్క గొడుగు లేసుకుని ఎదురు చూస్తున్న అమ్మలో, అక్కలో, ఆయాలో గానీ ముందుకు వచ్చి, ఆ పిల్లల భుజాల బరువంతా ఊడలాగి తమ మీద పడేసుకుని వాళ్ళని గొడుగుల్లోకి లాక్కుని తీసుకెళుతున్నారు.



సైకిల్ బళ్ళమీద కూరగాయలు నేర్పుగా పేర్చుకుని పక్కనున్న సీనారేకు డొక్కులో నుంచి నీళ్లు జల్లుతూ - 'తాజా కూర'లని కేకలు పెడుతూ పోటీలమీద పోతున్నారు నల్గురు కుర్రాళ్ళు! వెన్నెట్లో నడుస్తున్నంత కులాసాగా ఉంది వాళ్ళ వరుస!

వయస్సు పొగరు అలాంటిది మరి!

సంచులు, బ్యాగులు, బుట్టలు పట్టుకుని పాల ప్యాకెట్ల కోసం హడావిడిగా బయల్దేరేరు. అప్పుడే కొందరు అంగనామణులు!

ఎండనుకుంటే కుదరదుగదా? అవసరం అలాంటిది! పేపర్లు సీసాలు, డబ్బాలు కొనుక్కునేవాడు తట్ట నెత్తిన పెట్టుకుని నీరసంగా అరుస్తున్నాడు. సందు చివర ఓ స్టీల్ సామాన్ల అవ్వ నడుముకి కట్టుకున్న గుడ్డ ఉయ్యాల్లో నెలల పసిగుడ్డును కూర్చోబెట్టుకుని, గొంతెత్తి నాల్గు వీధులకి వినిపించేలా అమ్ముతోంది! తల్లితో పాటు ఆ పసిగుడ్డు కూడా ఎండంతా భరిస్తోంది!

బ్రతుకు తెరువుకోసం అగచాట్లెన్నైనా భరించాల్సిందే గదా

ఇంతలో-

ఆదరాబాదరా హేండ్ బ్యాగ్‌లు ఊపేసుకుంటూ, చెమట కక్కుకుంటూ, జారిపోతున్న నైలెక్స్ చీరల్ని సర్దుకోలేక ఆయాసపడుతూ లేస్తూ మార్నింగ్‌షోలు చూసి వస్తున్నారు కొందరు మహిళలు. సినిమా చూసిన ఆనందం కన్నా స్కూళ్ళ నుంచి పిల్లలు వచ్చారేమో, ఆఫీసునుంచి భర్త వచ్చే వేళకి టిఫిన్, కాఫీలు చేయగలమో లేమో అన్న ఆరాటం, ఆదుర్దాయే వాళ్ళ ముఖాల్లో తాండ విస్తోంది!

'బాధ్యత గల ఇల్లాళ్ళకి సరదాలు తీరాలంటే ఆ మాత్రం హైరాన తప్పదు కదా?' అనుకుంటూ కిటికీ కర్టెన్ సరిచేసి లేవబోతున్నప్పుడు చూసేను.

సందు చివర భారంగా అడుగులు వేస్తూ ఓ పెద్దావిడ చేతిలో సంచీతో వస్తూంది. ఒక ఇంటి ముందు ఆగి కొంతసేపు ఆలోచించి లోపలికి వెళ్ళింది. 'ఎవరోలే' అనుకుని లేచి ఇంట్లోకెళ్ళి పోయేను.

మరొక పావుగంట తర్వాత, ఏదో పనిమీద బాల్కనీలోకి రాగానే ఆ పెద్దావిడ రెండో ఇంట్లోకి వెళ్తోంది. 'బహుశా ఆ మొదటి ఇల్లు కాదేమో?' అనుకుని వెనుతిరగబోతుంటే, మళ్లీ ఆవిడ... ఆ రెండో ఇంట్లో నుంచి కూడా బయటికివచ్చి మూడో ఇంట్లోకి వెళ్ళనా మాననా, అన్నట్టు సంశయంగా కాస్త సేపు ఆగి, ఇక మానేసి నాల్గో ఇంటికి - అంటే సరిగా మా పక్క ఇంట్లోకి వెళ్తోంది! ఇదేదో ఇల్లు వెతుక్కుంటున్న బాపతులా లేదు... ఇంటింటికి వెళ్లి వస్తుండటం అంటే ఆవిడ ఏదో అడుగుతున్నదో అమ్ముతున్నదో... ఏదో అయి ఉండాలి...

మనిషి మాత్రం ఆ రెండు పనులు చేయతగ్గ స్థాయి కన్న పై మెట్టు మీద ఉన్నట్లు కన్పడుతోంది.

'ఏమిటో ప్రతివాళ్ళకి ఇలాంటి బుద్ధులు పుడుతున్నాయేం? ఈ ఎర్రని ఎండలో - ఇంత పెద్ద వయస్సులో ఎందుకొచ్చిన అవస్థ?'

'దేనికైనా హద్దు పద్దు ఉండాలి!'

'సయమా సమయాలు చూసుకోకుండా వయస్సు మరచి, అంతస్తు కప్పి పుచ్చుకుని ఏమిటో ఈ దురాశాలు, లాలస'.

నా మనసు అనేక రకాలుగా విమర్శిస్తోంది ఆవిడ గురించి! కోపం



## కథాంతరంగం



సమాజంలో కొన్ని వాస్తవాలు కఠినంగా, నమ్మలేనంత ఆశ్చర్యంగా వుంటాయి. ఓడలు, బళ్లు, బళ్లు ఓడలు అయినట్లు మానవ జీవితంలో తారసపడే అనూహ్య పరిణామాలనుండి తప్పించుకోవడం ఒక్కోసారి ప్రయత్నపూర్వకంగా కూడా సాధ్యపడదు. అంతర్లీనంగా వుండే మమతానురాగాలు, వాత్సల్యానుబంధాలు ఎంతటి కష్టానికైనా ఓర్చి, త్యాగానికి వెనుకాడనివ్వవు. ఒకప్పుడు ఆఫీసరు భార్య అయినా అయిన వాళ్లు ఆదుకోడానికి ముందుకి రానపుడు, కన్నకూతురి కోసం అప్పడాలు, వడియాలు లాంటివి ఇంటింటికీ అమ్మే కన్నతల్లి యధార్థగాథే 'నూటికో తల్లి'. ప్రేమించడం తప్పుకాదు .పేదరికం నేరం కాదు. కాలం కలిసి రానపుడు కష్టాలకు ఎదురీదాల్సిందే. తల్లి ప్రేమను గొడుగులా పట్టి సాయపడే అమ్మకథ ఇది .ఆధునికంగా ఆకుమేఘాల మీద ఎదిగే వ్యవస్థలో ఇంకా ఇలాంటి తల్లులకు దీనత్వం మిగలడం? దాన్ని అధిగమించే 'నూటికో తల్లి' లాంటివాళ్ళు నడుస్తున్నపుడు ఎండే వెన్నెల నీడై పరుచుకుంటుంది. ఆ వెన్నెల నీడ సాటివారు కావాలని కోరిక. అలా వాస్తవాంశంతో అల్లిందే ఈకథ. మంచితనం మానవత్వానికి పాదు.

**- వేదుల శకుంతల**

**సెల్: 9247846581**

కూడా వస్తుంది. ఇంతలో ఆవిడ మా తలుపు కూడా బజ్జర్ నొక్కి తెరిపించింది. చూసేను ఆవిణ్ణి పరీక్షగా.

సన్నటి పట్టు అంచున్న ఆకుపచ్చ వరయూరు చీర నిండుగా కప్పుకున్న కొంగులో నుంచి తొంగి చూస్తున్న పాప్లిన్ తెల్లరవిక. వెండితో చుట్టించుకున్న పగడాల గొలుసు. చెవులకి ఎర్రరాళ్ళ దుద్దులు... చేతికి ఒకో బంగారపు గాజు. వేలికి ఒంటిరాయి ఉంగరం. సగానికి సగం నెరసిన జుట్టు పైకి ముడివేసి... అందులో పైకి కనుపిస్తున్న పిన్నులు... కుంకుమలేని చోట చిన్నమచ్చ...

'అమ్మా, చారుపొడి, కందిపొడి, అప్పడాలు, వడియాలు... తీసుకుంటారా, అమ్మా.' చేతిలో ఉన్న బరువైన సంచీని కిందపెట్టి కొంగుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ చిరునవ్వుతో అడిగింది ఆవిడ.

చిన్నగా నిశ్వసించి 'అక్కర్లేదండి' అని కొంచెం కరుకుగానే అన్నాను. 'ఇదన్నమాట!' అనుకున్నాను మనసులో...

'చూడండి అమ్మా! మంచివాసన... చిటికెడు పొడుం వేస్తే చాలు... ఇంకేమీ వేయనక్కర్లేదండి! అన్ని పాళ్ళూ ఇందులో వేసి తయారుచేసేమండి! అప్పడాలు కూడా పెద్దసైజులో చేసేమండి కంది పొడుం స్వయంగా విసిరేమండి. ఒక్క ప్యాకెట్ తీసుకోండమ్మా. ఏదైనా రెండు రూపాయలే నండి' ఆవిడ గబగబా సంచిలో నుండి ప్యాకెట్లు తీసి చూపిస్తోంది... ఆ నమ్రత. ఆ నెమ్మదిగా చెప్పడం, అన్నిటికన్నా తనకన్నా చిన్నదాన్నైనా నన్ను 'అండి' అని మన్నించడం నాకెంతో బాధనిపించింది.

'అదికాదండి మేము సరుకులన్నీ నెల మొదట్లోనే కొనేసుకుంటాం! అన్నీ ఉన్నాయి. ఇప్పుడేమీ అక్కర్లేదు' కొంచెం సౌమ్యం తోటే అన్నాను.

'అలాగాండీ! సరే అయినా ఇంట్లో తయారు చేసేమని, బాగా ఉంటాయని చెప్తున్నానండి! పోనీ ఒక్కటంటే ఒక్క ప్యాకెట్ తీసుకుని చూడండి!' ఆవిడ చిరునవ్వు నన్ను లొంగదీసుకుంది. పోనీ రెండు రూపాయలే కదా? ఒకటి తీసుకుందామనుకున్నాను.

'తీసుకోండమ్మా!'

'సరే, ఇవ్వండి!'

ఒక ప్యాకెట్ అందిస్తూ 'బలవంతం చేస్తున్నానని కోపగించుకోకండి! అవసరం అలాంటిది! నాల్గు ప్యాకెట్లు అమ్మితే ఏదో కొంతేనా డబ్బు వస్తుందని ఆశండి!' అంటూంటే ఆవిడ కంఠంలో సన్నని జీర నీటిమీద అలలా కదిలింది.

ఆవిడ కళ్ళలోకి చూసేను...

చిరుమేఘం లాంటి విచార రేఖ రెపరెపలాడినట్లైంది. మౌనంగా ప్యాకెట్ తీసుకుని లోపలి నుండి రెండు రూపాయలు తెచ్చి ఇచ్చేను. ఆవిడ గుమ్మం బయటే నుంచుని ఉంది!

డబ్బు తీసుకుంటూ 'అమ్మా, కొంచెం మంచినీళ్ళు ఇస్తారా?' అని అడిగింది. లోపలికెళ్లి తెచ్చి ఇచ్చాను.

గ్లాసెత్తిపెట్టి గటగటా తాగి 'చాలండి ఎండలో వస్తే నోరెండి పోతోందండి!' అంటూ చిన్నగా నవ్వింది.

'మరి ఇంత ఎండలో పెద్దవారు కదా మీరెందుకు వచ్చారు? చిన్నవాళ్ళ నెవరినైనా పంపాల్సింది. అయినా ఈ అమ్మకం ఎన్నాళ్ళ నుంచి చేస్తున్నారు. మేము ఇక్కడ చాలాకాలం నుండి ఉన్నాము. ఎప్పుడూ మీరు వచ్చినట్టు చూడలేదు నేను' అన్నాను.

అదే చిరునవ్వు చెరిగిపోకుండా... 'నిజమేనండి! నేను ఇది వరకూ ఎప్పుడూ రాలేదు. ఈ మధ్యే - అదే రెండు మూడు నెలల నుంచి వస్తున్నాను. ఇంట్లో చిన్నపిల్లలెవరూ లేరండి! అంటే అదే కాస్త ఎండను తట్టుకుని తిరగగల పిల్లలన్నమాట. అందుకని నేనే రావల్సి వస్తుంది' అన్నది ఎంతో మృదువుగా.

'అయితే ఏ పొద్దుటివేళో... సాయంకాలపు పూటో రాకూడదా బొత్తిగా ఇంత ఎర్రని ఎండలో...?' అంటూ సందిగ్ధంలో ఆగిపోయాను.

అసలు ప్యాకెట్ కొన్నాక అన్ని వివరాలు అడగక్కర్లేకుండానే ఎంతోమంది ఏజెంట్లని, సేల్స్ గర్ల్స్‌ని పంపిస్తూ ఉంటారు. కానీ ఈ పెద్దావిడ కాస్త సంస్కారము, స్థితి బాగా ఉండి, ఇంత ఎండలో అంత అవసరంగా ఈ వ్యాపారము ఎందుకు చేస్తున్నట్టో తెలుసుకోవాలన్న తహతహ నా ఆంతర్యంలో ఉంది. అందుకే అన్నిరకాలుగా ప్రశ్నలు వేస్తూ నిలబడ్డాను... పల్చటితెర వెనక్కి తప్పుకున్నట్లుగా ఆవిడ చిరునవ్వు క్షణకాలం మసకకమ్మి తరువాత మళ్ళీ ప్రకాశవంతమైంది.

'అమ్మా! మీకిప్పుడేమీ పని తొందరలేకపోతే నేను రెండు మాటలు మాట్లాడ్తాను. వింటారా' అన్నది.

'చెప్పండి ఏమిటో'

ఆవిడ అక్కడే కొద్దిగా ఆయాసపడుతూ కూర్చుంది. కొంగుతో మెడ, నుదురు తుడుచుకొని మొదలెట్టింది.

'ఈ వెనక వెంకట్రమణానగర్ కాలనీ ఉంది తెలుసుకదండి. ఆ తర్వాత ఆనందనగర్ కాలనీ చివర్లో మా అమ్మాయి, అల్లుడు ఉంటున్నారండి. అమ్మాయి చిన్న కంపెనీలో ఉద్యోగం చేస్తుందండి. అల్లుడు పెద్దగా చదువుకోలేదండి. అందుకని అతడు ఏదో చిన్న ఉద్యోగము చేస్తున్నాడు. కానీ పర్మినెంట్ కాదండి. పోయినప్పుడల్లా మళ్లీ కొత్తది వెత్కుకోటమే! అయితే అమ్మాయి జీతము ఉంటుంది గనుక... ఏదో అవస్థపడుతున్నా నెట్టుకుని వస్తున్నారు. కానీ అమ్మాయి మొన్ననే పురుడు పోసుకుంది. బాలింతరాలు. సెలవులో ఉంది. కంపెనీ చిన్నది. అందుకని జీతం అదీ సరిగా రాదు. అందులో పసిపిల్లాడు ఖర్చు అదనంగా తగుల్తోంది, డబ్బుకి చాలా కటకట లాడి పోతున్నారు.'

'నేను అమ్మాయికి పురుడు పోయడానికి రామచంద్రాపురం నుండి వచ్చానండి. అక్కడ మా అబ్బాయిలు ఇంజినీర్లండి. మా వారు కూడా సూపరింటెండెంట్‌గా రిటైర్ అయిపోయేరు! పెద్దమ్మాయి, అల్లుడు పూనాలో ఉంటారండి. ఆ అల్లుడు అక్కడ డిఫెన్సులో ఉద్యోగము చేస్తున్నాడు.'

'అమ్మా మీరు ఇవన్నీ విని ఆశ్చర్యపోతున్నారు కదూ. సహజమే మరి. అందరి పొజిషన్లు ఇంత బాగా ఉంటే ఈ చిన్నల్లుడేమిటి ఇలాంటి వాడికెందుకు కిచ్చారు! ఇచ్చినా నేనీ పని చేసి కష్టపడట మెందుకు డబ్బు తెచ్చి ఇవ్వవచ్చును కదా. లేదా అమ్మాయిని హాయిగా ఇంటికే తీసుకెళ్ళ వచ్చును గదా. అని అనుకుంటున్నారు. అవునా....'

'నాకు తెల్సండమ్మా, ఎవరైనా అలాగే అనుకుంటారు. కానీ, కొన్ని 'దురదృష్టాలు' అవకాశాల్నీ.. ఆనందాల్నీ... అందుకో నీయవు. మా అమ్మాయి ఆ పరిస్థితి లోనే ఉంది.'

'దాని పెళ్ళి నిమిత్తం... పాతిక వేలు కేటాయించి... వాళ్ళ నాన్నగారు... కొడుకుల మీద బాధ్యత పెట్టిపోయేరు. అయితే ఆయన చేసిన చిన్న పొరపాటు ఏమంటే - డబ్బంతా కొడుకుల పేరే ఉంచారు. మంచి సంబంధం -- మనకి తూగే సంబంధం -- చూసి చేయమన్నారు.'

'కానీ అమ్మాయి -'తనకి నచ్చినవాణ్ని - తనను వరించినవాణ్ణి చేసుకుంటానంది. మా అబ్బాయిలు, కోడళ్ళు... అభ్యంతరాలు లేవదీసేరు. 'నీకన్నా తక్కువ

చదువు – ఆర్థికంగా మైనస్‌లో ఉన్నవాణ్ని చేసుకుని మా పరువు తీయకనీ –– నువ్వూ ఏమీ సుఖపడలేవనీ తిట్టి పోసేరు. ఇంతకీ అతను మాకు దూరపుబం ధువే. కానీ మాకన్నా చాలా తక్కువ స్థితిలో ఉన్నారు. తల్లితండ్రులు లేరు. అన్నలు, అక్కలు లేరు. ఉన్నవాళ్ళు ఇద్దరు తమ్ముళ్లు. వాళ్ళు ఏవో చిన్న ఉద్యోగాలు చేస్తూ పెద్దనాన్నగారింట్లో ఉన్నారు.'

'అమ్మాయికి నేను ఎన్నివిధాల నచ్చ చెప్పబోయినా, ససేమిరా అని అతన్నే చేసుకుంటానంది. అందుకని మా అబ్బాయిలు, కోడళ్లు ఇంట్లో పెద్దయుద్ధం చేసి – నీ ఖర్మ – నువ్వు అనుభవించ మని – క్లుప్తంగా గుళ్లో పెళ్లి చేసి పంపించేసేరు – వాళ్ళమాట వినలేదు గనుక...! ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. అంతావాళ్ళ పేరు మీదే ఉంది గదా. వాళ్ళ నాన్నచేసిన ఈ తప్పు మా అమ్మాయికి దురదృష్టమై – పుట్టింటి నుంచి అందుకనే ఆనందాలకి అవకాశాలకీ దూరం చేసేసిందండి!'

'మా పెద్దమ్మాయి, నేను ఎన్నో రకాలుగా మా అబ్బాయిలకి చెప్పేమండి – 'పోనీ దానికిష్టమైన వాణ్ని చేసుకుంది – ఏదో కొంత డబ్బు దాని పేరు బ్యాంక్‌లో వేయ'మని ... కానీ... హూ...! వాళ్ళు వినలేదండి. డబ్బంతా ఖర్చు పెట్టేసుకుని మళ్ళీ దేభ్యముఖంతో వస్తుంది ఇంటికి. వాడు ఉద్యోగము చేసి ప్రయోజకుడైన ప్పుడు –– తప్పకుండా దానికి కావల్సినంత ఇస్తాం అన్నారు.'

హూ! అమ్మాయికి అసలే పౌరుషం! 'మీ దగ్గర్నుంచి పైసాకాదు కదా చీపురు పుల్లయినా తీసుకోను. ఇప్పుడే కాదు, జన్మలో తీసుకోను మా బ్రతుకు మేం బ్రతక గలం అని కాపరానికి వెళ్ళిపోయింది!'

'అమ్మా! అవసరానికి ఆపదకి ఆదుకోలేని డబ్బు తర్వాత ఎప్పుడో ఇస్తామంటే ఎందుకు? కష్టం వచ్చినప్పుడు ఒక్క పైసా కూడా కోటి విలువ చేస్తుంది. సుఖంగా ఉన్నప్పుడు – లక్షలు ఇచ్చినా అక్కర్లేదు... ప్రతివాళ్ళూ ఎదుటివాళ్ళు ప్రయోజకులై హాయిగా ఆనందంగా ఉన్నప్పుడు ఎదురెళ్ళి ఆమోదం తెల్పుతామంటారే కానీ దిగజారి కష్టాల్లో ఉన్నప్పుడు చేయూతనిచ్చి పైకి తీసుకొస్తా మనరు. అందుకే మని షికీ, మనిషికీ మధ్య ఇన్నేసి అఘాతాలు! 'అయిన' వాళ్ళంతా ఉన్నా – ఆదుకోగల ఆర్థిక స్తోమత ఉన్నా మా అమ్మాయి ఒంటరిదై ఇబ్బందిలో పడింది!'

'అమ్మా పురిటికి కూడా అది నన్ను రమ్మనలేదు. నేనే తెల్సుకుని వచ్చాను. పుట్టింటి సొమ్ము నాకు వద్దంది. అబ్బాయిలు సరే! నా ఖర్చుకి ఇచ్చారు తప్ప – దానికంటూ ఏమీ ఇవ్వలేదు. ఆడదానికి ఆర్థికబలం లేకపోతే... ఎంత నరకం అను భవిస్తుందో... నాకు అనుభవమైంది! భర్త ఉన్నంత కాలం హోదాగా బ్రతికేను. కానీ స్వతంత్రంగా, స్వేచ్ఛగా జీవించాలనుకునే స్త్రీ... ఆ భర్త లేకపోతే... ఆర్థికంగా కూడా తాహతు పోగొట్టుకుంటే... బ్రతికి ఉన్నా చచ్చినట్టే లెక్క!.'

'వీళ్ళని నే ఒక్క తల్లినే కన్నాను – అయినా కొడుకులు, కోడళ్లు హాయిగా ఉన్నారు. పెద్దమ్మాయి సుఖంగానే ఉంది. కానీ ఈ చిన్నమ్మాయి బ్రతుకే... ఇలా ప్రారంభమైంది. నిజానికి మనసుకు నచ్చినవాణ్ని చేసుకోవడము నేరం కాదు. పేదరికం తప్పుకాదు, మరి దానికెందుకీ శిక్ష?'

'ఇదంతా డబ్బు మహత్యం. అమ్మా! మా అబ్బాయిలు చెప్పినట్టు విని, అది ఏ గొప్పింటివాణ్నో చేసుకుంటే – ఈ పాటికి సారెలు చీరలు అట్టహాసంగా పెట్టించే వారు కోడళ్ళు. సమాజంలో మా ఆడపడుచు ఫలానా వారికోడలు... ఫలానా ఆఫీసర్‌గారి భార్య అని చెప్పుకుందురు కానీ ఇప్పుడు అలా కాకుండా పోయిందని – సిగ్గుచేటని వాళ్ళ బాధ 'ఉన్నవాళ్ళకే పెట్టాలనుకుంటే...' లేనివాడి గతేమిటి?

'అమ్మా! మా అమ్మాయి కష్టపడుతున్నా సంతోషంగానే ఉంది. వాళ్ళిద్దరూ అన్యో న్యంగానే ఉన్నారు. నాకు కావల్సింది అదే! అయితే తల్లిని గనుక... బాలింతరాలైన కూతురికి ఏదైనా చేసి పెట్టుకుందామని ఆరాటపడుతున్నాను. అమ్మాయి జీతం రావటం లేదు. అతని రాబడి తక్కువ! అబ్బాయిల దగ్గర దెబ్బలాడి తెచ్చిస్తే లేదా నా ఒంటిమీద గాజులు అమ్మదామంటే – అమ్మాయి ఒప్పుకోదు! ఇక ఏదీ దారి? ఏం చెయ్యను! కొద్ది పెట్టుబడితో శ్రమపడి ఈ చిన్న వ్యాపారం చేస్తే... బాగుంటుందనిపిం చింది. కిరాణా కొట్లో ఖాతా రాయించి ఇంట్లో విసిరి –– ఇలా అమ్ముతున్నాను. ఈ రెండు నెలల నుంచి ఈ పని చేస్తుంటే... ఖాతా జమకట్టగా నలభైదాకా మిగుల్తు న్నాయి. అమ్మాయికీ, పసివాడికీ ఉపయోగ పడుతున్నాయి. నాకూ తృప్తిగానే ఉంది.'

'అమ్మా, మీరన్నట్టు పొద్దుటో... సాయంకాలమో రావచ్చును. కానీ... పొద్దుట వంటావార్పు వుంటుంది. సాయంకాలం అల్లుడు చూస్తే నొచ్చుకుంటాడు అందు కని మధ్యాహ్నం పూట పెట్టుకున్నాను ఈ పని. పెద్దదాన్నే కష్టమే. కానీ.. నేను తల్లిని. అది బాలింతరాలు. ఇప్పుడు ఇబ్బందుల్లో ఉంది. నా బాధ్యత అనేకన్నా దాని పట్టుదల ధైర్యాన్ని నేను మెచ్చుకుని – నా చేయూతనిస్తూ గర్వపడుతు న్నాను. తృప్తి పడుతున్నాను – ఒక వేళ మేము కూడా ఆర్థిక పరిస్థితి బాగులేక ఈ అల్లుడిలాంటివారమే అయితే –– అప్పుడే ఏదో రకంగా అమ్మాయి పురుడు, పుణ్యం పోసి పంపించే వాళ్ళమే కదా! అప్పుడు కష్టపడి ఏ పనిచేసినా –– అందరూ ఒప్పుకుందురు ఇప్పుడు అలాకాదు అవమానంగా భావిస్తారు.'

'కాని, అమ్మా. నేను అవమానం అనుకోవడం లేదు... పరువు తక్కువనుకో వడం లేదు.. నా స్వయం సంపాదనతో – నా కూతురికి నేను కావల్సినవి పెట్టుకో గల్గుతున్నానే అన్న సంతోషం అనుభవిస్తున్నాను. నా కిప్పుడు ఆత్మస్థయిర్యం కూడా కలిగింది. ఫరవాలేదు – నీతి తప్పని ఏ పనైనా చేసి – అనుకున్నది సాధిం చవచ్చని తెలుసుకున్నాను. అందుకే ఇలా అమ్ముతున్నాను.'

'అమ్మా. వస్తాను చాలాసేపైంది. మీ టైమ్ పాడు చేశాను ఏమనుకోకండి' అంటూ చిన్నగా నవ్వుతూ లేచింది ఆవిడ – వింటున్న నాకు మనసంతా చెప్పలేని ఆర్తితో... భాష కందని అనుభూతితో నిండి పోయింది.

అంతకుముందు తెచ్చుకున్న కోపం... చిరాకు... ఆవిడ వ్యక్తిత్వపు విలువ తెల్సేక.. సిగ్గుపడి పారిపోయేయి. ఒక ఆఫీసర్ గారి భార్యగా ఆవిడ వేషంలో తప్పిదం లేదు. ప్రేమించి పెళ్ళి చేసుకున్న కూతుర్ని మెచ్చుకుంటూ –– ఇంత ఎండలో అలా ఇంటింటికి తిరిగి అమ్ముతున్న పనిలో – లోపం లేదు – తొందర పాటుగా ఆలోచించిన నా మనసే తప్పు చేసింది.

వేళాపాళా చూడని అమ్మలక్కలూ – సరదాలు, సంబరాలకోసం పరుగులెట్టే




అంగనామణుల కన్నా – ఈ తల్లి సేవ – ఎంత ఉన్నతంగా ఉంది.

ఆవిడ లేచి వెళ్తూ 'అమ్మా. ఇంకెవరన్నా మీ వాళ్ళు కొనే వాళ్ళుంటే చెప్పండి. ఏదో మరో రెండు నెలలు ఉంటాను. అంతవరకు ఈ పని చేస్తాను. చెప్తారా' అని ప్రశ్నిస్తుంటే–

'అలాగే చెప్తాను. మీరు పెద్దవారు. నన్ను 'మీరు' అనకండి. ఉండండి మీ అమ్మాయికి కాస్త పాత ఉసిరి పచ్చడి – నిమ్మకాయ ఇస్తాను...'' అన్నాను.

'అహ. వద్దమ్మా – అది అసలే...'

'అలా అనకండి. నా చెల్లెలాంటిది. ఓ అక్క ప్రేమతో ఇచ్చిందని చెప్పండి' అని గబగబా లోపలికి వెళ్ళి రెండు చిన్నసీసాల్లో ఉసిరికాయ, నిమ్మకాయ – ఊరగా యలు సర్దితెచ్చి ఆవిడకు అందించేను...

ఆవిడ కళ్ళల్లో –– సన్నని నీటి పొర.

పెదవుల కంపన.... స్పష్టంగా చూసేను/అందుకుని సంచీలో పెట్టుకుంది.

'అమ్మా ' వస్తానమ్మా' అని వెనుదిరిగింది.

ఆమె వెళుతుంటే కిటికీలో నుంచి చూస్తున్నాను. అప్పుడు నాకు ఆవిడ ఎండలో వెళ్తున్నట్టు లేదు...

'నూటికో తల్లైనా' ఇలా ఉంటే – ఈ ఎండ వెన్నెలై పోదా?' అనిపించింది.

❋

(ప్రథమ ప్రచురణ 1984 సం..లో ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక)